www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 నవంబర్ 2025



కాయకల్ప పురస్కారానికి పీలేరు ప్రాంతీయ ఆస్పత్రి ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి కాయకల్ప పురస్కారానికి ఎంపికైందని ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రత, నాణ్యత పెంచడానికి, రోగులకు మెరుగైన సేవలు చేసిన ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం కాయకల్ప పురస్కా రాలను అందిస్తోందన్నారు. పీలేరు ప్రాంతీయ ఆస్పత్రికి అవార్డు వరించిందన్నారు. పురస్కారానికి పీలేరు ఏరియా ఆస్పత్రికి ప్రథమ స్థానం లభించిందని చెప్పారు. ఈ విషయం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ప్రకటించినట్లు తెలిపారు. అవార్డు తోపాటు పీలేరు ఏరియా ఆస్పత్రికి రూ.3 లక్షలు నగదు కూడా ప్రకటించినట్లు తెలియజేశారు.



పురస్కారానికి ఎంపికైన పీలేరు ఏరియా ఆస్పత్రి


జిఎన్ఎస్ఎస్ పనులకు మోక్షమెప్పుడో?



- 'ముదివేడు' నిర్వాసితులకు పరిహారమేదీ
- జ్యూస్ పరిశ్రమల ఏర్పాటుకు నిరీక్షణ
- కదిలికలేని కడప-రేణిగుంట రహదారి పనులు
- నేడు చిన్నమండెంకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

అన్నమయ్య జిల్లా పెండింగ్ సమస్యలకు నిలయంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, హంద్రీ-నీవా సాగునీటి ప్రాజెక్టు పనుల దగ్గర నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలు, నిర్వాసితులకు పరిహారం, వందలాది ఎకరాల భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమన సమస్యలతో సతమతమవుతోంది. రాష్ట్రంలోనే కరువు మండలాలకు అన్నమయ్య జిల్లా నిలయం. దుర్భిక్ష ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పాలకులు చొరవ తీసుకోవాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండల పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న నేపథ్యంలో కథనం...





ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెత చందంగా మారింది. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలుస్తోంది. జిల్లాలో మామిడి, అరటి తోటలు ప్రకృతి వైపరీత్యాతోటలు బారిన పడిన సంగతి తెలిసిందే. మామిడి పూత పూయడం లేదు. ఫలితంగా తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. ఉద్యాన నిపుణుల సహకారం తీసుకుని సమస్యను అధిగమించ డానికి పాలకులు కృషి చేయాల్సి ఉంది. ఉద్యాన పంటలకు నిలయమైన రైల్వేకోడూరులో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు రిజర్వాయర్ నిలిచిపోయింది. ఫలితంగా రాయచోటి, చక్రాయపేట మండలాల్లో సుమారు 72 చెరువులకు జలకళ ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యాన యూనివర్శిటీకి మోక్షమేదీ

రాజంపేట నియోజకవర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం వెలవెలబోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జ్యూస్ పరిశ్రమ హామీ ఏమైంది

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి, తోటలు సహా ఇతర పంటల సాగుకు అవసరమైన నర్సరీలతో కళకళ లాడుతోంది. ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ వెలవెలబోతోంది.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో భాగమైన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునురుద్ధరణ, ముదివేడు, ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. ముదివేడు నిర్వాసితులు పరిహారం కోసం నిరీక్షిస్తున్నారు.

పట్టాలెక్కని జాతీయ రహదారులు

కడప-రేణిగుంట రహదారిసర్వే దశను దాటని పరిస్థితి నెలకొంది. కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు. అన్నమయ్య, బెంగళూరు-విజయవాడ ఎన్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. 15 ఏళ్లుగా గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజా సమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పకీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా స్థానిక వనరులతో సంపదను సృష్టించే ప్రణాళికలు, ముందుచూపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలలోని 50 ఎంఎస్ఎంఇ పార్కుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. మండలంలోని శిబ్యాల గ్రామంలో మంత్రి, కలెక్టర్ నిశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పింఛన్లు, ఉచిత బియ్యం, అమ్మఒడివంటి సంక్షేమ పథకాలపై మాత్రమే దృష్టి సారించి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కేవలం సంక్షేమమే కాకుండా, అభివృద్ధిని కూడా చేసి చూపిస్తోందన్నారు. ప్రజలకు నిత్య అవసరాల కల్పనే కాకుండా, ఉద్యోగ కల్పన ద్వారా వారికి సాధికారత కల్పించడంపై దృష్టి సారించిందని తెలిపారు. మన రాయచోటిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం ఇక్కడ ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒక మహోన్నతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎపిలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ ఎపిఐఐసి తరఫున ఇండస్ట్రియల్ పార్కులు శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే తరానికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తామన్నారు. అందులో భాగంగానే ఉపాధి కల్పించాలంటే రాష్ట్రంలో పెట్టు బడులు రావాలన్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే ఇక్కడ ఫ్యాక్టరీలు ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. మన ప్రాంతంలోనే ఫ్యాక్టరీలు, ఐటి కంపెనీలు ఇలాంటి పరిస్థితి వస్తేనే మన బిడ్డలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. స్కూల్ విద్యార్థులు కూడా పరిశ్రమలు ఉపాధి వంటి అంశాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.350 కోట్లతో ఇంటింటికీ నీళ్లు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ నుండి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని చెప్పారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 ప్రదేశాల్లో పరిశ్రమల యూనిట్లు, ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని చెప్పారు. కొన్ని యూనిట్లు పూర్తయ్యి ప్రారంభించామని చెప్పారు. 50 కొత్త ఎంఎస్ఎంఇ పార్కులకు శంకుస్థాపన కూడా చేశారన్నారు. పరిశ్రమల అభివృద్ధిలో చారిత్రాత్మక మైలురాయిగా నిలవనున్నాయన్నారు. ఇకపై రాష్ట్ర యువత దూర ప్రాంతాలకు వెళ్లకుండానే తమ సొంత జిల్లాల్లో ఉపాధి పొందగలరని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రాష్ట్ర పాలఏకరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, ఎపిఐఐసి డైరెక్టర్ కొండ భాస్కర్‌రెడ్డి, ఫారెస్ట్ డైరెక్టర్ రెడ్డి యాదవ్, ఎఎంసి చైర్మన్ అనంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, కోడి శ్రీను పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఇ పార్కు ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుంది..

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పు అంటూ సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగుతుందని చెప్పారు. తాను రాయచోటికి చెందిన ప్రజా ప్రతినిధిగా చెబుతున్నా నూటికి నూరు శాతం రాయచోటినే జిల్లా కేంద్రంగా ఉంటుంది అన్నారు. రాబోయే మూడున్నర ఏళ్లల్లో రాయచోటిని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం : డిఆర్ఒ



ఉపాధ్యాయుడికి మెమోంటో ఇస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తొలి విద్యాశాఖ మంత్రి, మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డిఆర్ఒ కె. మధుసూదనరావు ముఖ్య అతిథిగా హాజరై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వేసిన బాటలోని మనందరం నడవాలని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడున్నారు. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడే కాక, సమగ్ర విద్యా అభివృద్ధి దిశగా చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. మైనారిటీ విద్యార్థులు విద్యారంగంలో రాణించి దేశాభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ విద్యా రంగంలో చేసిన సంస్కరణలు భారత భవిష్యత్తును నిర్మించాయినారు. ఆయన దూరదృష్టితోనే మన దేశం విద్యా స్వయం సమృద్ధికి చేరుకుందని చెప్పారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్. మస్తాన్‌బి మాట్లాడుతూ జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్మరించడం మనందరి కర్తవ్యంగా భావించాలన్నారు. ఆయన చూపిన మార్గంలో మైనారిటీ విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లాలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులు అసదుల్లా, హాసీం, మహమ్మద్ అలీ, మహమ్మద్ ఖాన్, షామీర్, సిబాతుర్ రెహమాన్‌కు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమం జిల్లా మైనారిటీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ డేవిడ్, కో-ఆర్డినేటర్ కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి కాలువ పనులు, వెలిగల్లు ప్రాజెక్ట్, శ్రీనివాస రిజర్వాయర్, అన్నమయ్య డ్యాం, ముదివేడు రిజర్వాయర్ వంటి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఉపాధి లేక బెంగళూరుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, నిరంతరం వేల మంది జిల్లా నుండి బెంగళూరు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్ పనులు పునఃప్రారంభించాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున రాష్ట్ర గ్రాంటుతో నిమిత్తం లేకుండా నిధులు విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించు కోవాలని పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి జరగాలఅంటే విద్యా, వైద్య సౌకర్యాలు, ఉపాధి, అంతర్గత రవాణా సౌకర్యం అభివృద్ధి చెందాలని అందుకు ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేయాలని, బిటి కళాశాల ఆస్తులను పరిరక్షించాలని కోరారు. మదనపల్లె ప్రాంతంలో ఐటి హబ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, తంబళ్లపల్లి ప్రాంతంలో తోళ్ల పరిశ్రమలు, కోడూరు ప్రాంతంలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపు లేని ఊకదంపుడు ప్రసంగాలు వద్దని, ప్రజలు హర్షించరన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి-రాయచోటి టౌన్: సిఎంచంద్రబాబు నాయుడు చిన్నమండెం పర్యటన సందర్భంగా భద్రత ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పర్యవేక్షణలో ఎస్పి ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో మంగళవారం చిన్నమండెంలోని ఎఆర్ కల్యాణ మండపంలో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రూట్ మ్యాప్, కాన్వాయ్ మార్గం, హెలిప్యాడ్, లబ్ధిదారుల పక్కా గృహాలు, ప్రజావేదిక పార్టీ క్యాడర్ మీటింగ్ ప్రాంతాల వద్ద కచ్చితమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ అధికారులు, పోలీసులు స్పెషల్ పార్టీ బృందాలు, బాంబ్ స్క్వాడ్, పోలీస్ జాగిలాల బృందాలు ఒకరితో ఒకరు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సిఎం భద్రత బృందంతో కలిసి ఎస్పి స్వయంగా కాన్వాయ్ రిహర్సిల్ నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్, పార్కింగ్, ప్రజా రవాణా సదుపాయాలపై ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమన్వయం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్పి ఎం వెంకటాద్రి, ప్రకాష్ బాబు, సిఎం సెక్యూరిటీ అధికారి కృష్ణారావు, రాజంపేట ఎఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే పాల్గొన్నారు.



ఎస్పికి సూచనలు చేస్తున్న కర్నూలు రేంజ్ డిఐజి ప్రవీణ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు ఆల్ ఇండియా 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. మంగళవారం కరపత్రాలను ఎన్‌జిఒ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడమే సిఐటియు లక్ష్యమని అన్నారు. ఈ ఆశయ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తుందని, సోషలిజం ఒకటే నేటి సమస్యలకు సరైన మార్గమని తెలిపారు. పాలకులు, పెట్టుబడిదారులు ఒకటై కార్మిక వర్గంపై దాడి చేస్తున్నారని, సంపద సృష్టించే యావత్తు కార్మిక వర్గం ఐక్యమైతే పాలక యంత్రాంగం, ఉత్పత్తి స్తంభించిపోతాయన్నారు. యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి హక్కుల కోసం దేశ వ్యాప్తంగా పోరాడే మహత్తర కర్తవ్యాలను ఎలా నిర్వహించాలో ఈ సభలో చర్చిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, ఎం.రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

కనసానివారిపల్లిలో శిక్షణ ఐఎఎస్‌ల పర్యటన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కనసానివారిపల్లి రైతు సేవా కేంద్రాన్ని శిక్షణ ఐఎఎస్ అధికారులు మంగళవారం క్షేత్ర అధ్యయన, పరిశోధన కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఐఎఎస్ అధికారుల బృందం మండలంలోని రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు అందజేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కార్యకలాపాలు, 365 రోజులు పంటసాగు విధానములు, ఖర్చు తగ్గించి మేలైన సాగు పద్ధతులపై రైతులతో మాట్లాడారు. రాష్ట్రంలో పండిస్తున్న వివిధ పంటలు, వాటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. పంటల సాగు, ఎరువుల వినియోగం, వ్యవసాయానికి సంబంధించిన పథకాలపై రైతులకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది అందిస్తున్న సూచనలు అమోఘమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికా రిణి వినుత, ఎంపిడిఒ గంగయ్య గౌడ్, ఆర్ఎస్‌కె సిబ్బంది భూదేవి, పవన్ కుమార్, తరుణ్, స్వాతి, మురళి మోహన్, బిందు, సుధాకర్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్ఎస్‌కె సిబ్బందితో శిక్షణ ఐఎఎస్ అధికారులు



మాట్లాడుతున్న సిఇఒ నాగభూషణం

'మిట్స్'లో డేటా సైన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, మిట్స్ అల్యూమిని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'డేటా సైన్స్ అండ్ డేటా ఎనాలిసిస్' అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా కళాశాల పూర్వ విద్యార్థులు బెంగళూరుకు చెందిన మైండ్‌ఎక్స్ సొల్యూషన్స్ సిఇఒ ఎం.నాగభూషణం, సొనాటా లిమిటెడ్ డేటా సైంటిస్ట్ పి.లక్ష్మి ప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ డేటా సైన్స్ ప్రాముఖ్యత, డేటా విశ్లేషణ పద్ధతులు, అలాగే ప్రస్తుత పరిశ్రమల్లో వాటి వినియోగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెద్ద మొత్తంలో డేటా నుంచి విలువైన సమాచారం సేకరించడం, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి సాంకేతికతల సమన్వయం ప్రాధాన్యతను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైజాగ్‌లో ఏర్పాటు చేస్తున్న గూగుల్ డేటా సెంటర్ ద్వారా లక్షల్లో ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నారని చెప్పారు. వాటికి డేటా సైంటిస్టుల అవసరం మరింతగా పెరుగుతుందని తెలిపారు. పి.లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ, విద్యార్థులకు డేటా వినియోగం, టెక్స్ట్ డేటా, ఆడియో డేటా, విజువల్ డేటా వంటి అంశాలపై వివరించి, తమ సంస్థ ద్వారా పైతాన్, జావా బేసిక్స్ వంటి కోర్సులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగశ్వేత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్.కిరణ్ కుమార్, జి.చరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత సూచనల మేరకు ఎన్ఎస్ఎస్ అధికారి వై.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఫార్మసీ తృతీయ సంవత్సరం పామిడి విద్యార్థులు గుండ్లూరు అగస్తేశ్వర స్వామి శివాలయంలో మంగళవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కార్తీకమాసం పురస్కరించుకొని ఆలయంలో భక్తాదులచే ఏర్పడిన మలినాలు, చెత్తను వారు శుభ్రం చేశారు. తమ కళాశాల విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో ముందు ఉంటారని ఎన్ఎస్ఎస్ అధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు.

అయోడిన్ లోపిస్తే అనారోగ్యం

ప్రజాశక్తి - నందలూరు

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అయోడిన్ లోపం పైన ఆడపూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం కళాశాల విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐజిడి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజ్ కలశాల విద్యార్థినిలకు అయోడిన్ లోపం వల్ల వచ్చే సమస్యలు, నివారణ, వచ్చిన తరువాత చికిత్స గురించి వివరించారు. వైద్యాదికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ మాట్లాడుతూ వంటలో అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విషదీకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హైమావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.వెంకట నారాయణ, ఎంఎల్‌హెచ్‌పిలు సబిత, ఆరిఫ్, ఎఎన్ఎం శాంత కుమారి, లెక్చరర్లు, ఆశా కార్యకర్త నాగసుబ్బమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విజయమే లక్ష్యంగా పనిచేయాలి : 'నల్లారి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కలికిరి

స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మండల ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులకు సూచించారు. మంగళవారం నగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో పీలేరు నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, గ్రామకమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే కావడానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తల సహకారమేనని చెప్పారు. వారు ఎంతో శ్రమించి గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజార్టీతో గెలిపించారని, అదే స్ఫూర్తితో కొత్తగా ఎన్నికైన మండల, క్లస్టర్ ఇన్‌ఛార్జులు మండలంలోని నాయకులను, కార్యకర్తలు అందరిని కలుపుకొని ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను వందశాతం గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసి నామినేషన్లు కూడా వేయనీయకుండా ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారని, కూటమి ప్రభుత్వంలో అలా కాకుండా అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అస్త్రంగా ప్రజల్లోకి వెళ్లాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా ప్రజల చేత ఎంపిటిసి, సర్పంచులు గెలిచి మన సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆరు మండలాల్లో ఎన్నికైన క్లస్టర్, మండల ఇన్‌ఛార్జులకు, బూత్ కన్వీనర్లకు శాలువా కప్పి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు చైర్మన్ నల్లారిచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాలతి, వైస్ చైర్మన్ సనావుల్లా, నాయకులు నిజాముద్దీన్, సూర్యప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎర్రం రెడ్డి, అగస్త్యేశ్వర్, దినకర్ గౌడ్, సుధాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-రామాపురం

రైతులు పంట పొలాలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి సూచించారు. మండలంలోని గువ్వల చెరువు, కసిరెడ్డి గారిపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి తన స్వభావాన్ని కోల్పోయి నిస్సారంగా మారుతుందన్నారు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజత్వాన్ని కోల్పోతుందని చెప్పారు. వరి, కంది పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రబీ సీజన్‌లో పండించాల్సిన పంటల గురించి వివరించారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ రైతు సేవ కేంద్రంలో ఈ క్రాప్ నమోదు తప్పకచేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈ గ్రోమర్ కమిటీ జిల్లా వనరుల కేంద్రం ఎఒ ప్రభావతమ్మ, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

18న 'బిట్స్'లో జిల్లా యువజనోత్సవాలు

ప్రజాశక్తి- రామాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు ఈనెల 18న భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్)లో అన్నమయ్య జిల్లా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 15-25 మధ్య వయసు కల్గి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ttps://tinyurl.com/dvfanmy వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు 'నారాయణ'లో స్టూడెంట్ ఎల్ఐడి కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని నారాయణ పాఠశాలలో బుధవారం స్టూడెంట్ ఎల్ఐడి కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు, విశిష్ట అతిథులుగా ఎజిఎం ఎ.ఆర్. ఫణికుమార్, ఆర్‌అండ్‌డి హెడ్, ఇ-కిడ్స్ అరభి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆర్ఐ ఆంజనేయులు, హెచ్ఎస్‌సి పి.రెడ్డి శేఖర్, ఐసిసి కె.జ్యోతి, ఇకెసి తహసీన్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాబోధన, ఇతర అంశాలపై అవగాహన, క్రీడలు, సాంస్కృతిక అంశాలపై విద్యార్థులను ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం వాయిదా

ప్రజాశక్తి-బి.కొత్తకోట : స్థానిక ఎంపిపిపై అవిశ్వాస తీర్మానానికి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 జీవో నెంబర్ 13 సెక్షన్ 245(2) ప్రకారం మదనపల్లి సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి ఆదేశాలు జారీ చేశారు. ఎంపిపిగా కొనసాగాలంటే ఎంపిటిసిల సంఖ్యాబలం నిరూపించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపిడిఒ అబ్దుల్ షుకూర్ మాట్లాడుతూ ఈ అవిశ్వాస తీర్మానాన్ని ఈనెల 12న నిరూపించుకోవాల్సి ఉండగా ఈ కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబు పర్యటన జిల్లా పర్యటన నేపథ్యంలో వాయిదా వేశామన్నారు. 14న నిర్వహించబోయే అవిశ్వాస తీర్మానానికి ఎంపిటిసిలందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

ప్రజాశక్తి - నిమ్మనపల్లె: అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం రాచవేటివారిపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ మాచిరెడ్డి గారిపల్లె గ్రామంలో సర్పంచు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్వామిత్వ సర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు స్వామిత్వ సర్వేపై ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేశారు. గ్రామ కంఠంలో నిర్మించిన ఇళ్లు, ఖాళీ స్థలాల యజమానులతో కలసి గ్రామసభను నిర్వహించి 9(2) నోటీసులతో పాటు పిపిఎం (ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్) లో పొందుపరిచిన వివరాలను చదివి వారికి వినిపించారు. స్వామిత్వ సర్వేలో పొందుపరిచిన వివరాలపై సంబంధించిన యజమానులు సంతృప్తి చెందిన తరువాత పంచాయతీ అభివృద్ధి అధికారి, గ్రామ సర్వేయర్, ఇంజనీరింగ్ సహాయకుల సంతకాల అనంతరం ఎంపిడిఒ సంతకాలు చేసి యజమానుల ద్వారా రసీదు తీసుకున్నామని చెప్పారు. దీనిపై యజమానులకు ఎటువంటి సందేహాలు, అనుమానాలు, అభ్యంతరాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. అటువంటి సమస్యపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయబద్ధమైన వాటిని 21 రోజులలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్రమణ్యం, పంచాయతీ అభివృద్ధి అధికారి రజిత, విఆర్‌ఒ హేమాంబర్ రెడ్డి, స్వామిత్వ సర్వే బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే కుట్రలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: కోళ్లబైలు పంచాయతీ సెక్రెటరీ మంజుల నిష్పక్షపాతంగా, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తుంటే చూసి ఓర్వలేని కొందరు వ్యక్తులు కావాలని కుట్రలు పన్నుతున్నారని కోళ్లబైలు పంచాయతీ ప్రజలు తెలిపారు. కోళ్లబైలు పంచాయతీ సెక్రెటరీ మంజులపై కొంతమంది పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు కావాలని ఆమెను వేధింపులకు గురి చేస్తున్నారని మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కోళ్లబైలు టిడిపి ఇన్‌ఛార్జి రాటకొండ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ ప్రజలు సబ్ కలెక్టరేట్ డిఎఒ నిర్మలాదేవిని కలిసి పరిస్థితి వివరించారు. సెక్రెటరీ మంజుల కోళ్లబైలు పంచాయతీలో బాధ్యతలు చేపట్టాక పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వసతి, వీధి దీపాలు, మౌలిక వసతులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో జరగని అభివృద్ధి, కూటమి పాలనలో 17 నెలలకే జరుగుతుండటంపై కొందరు జీర్ణించుకోలేక అసత్య ప్రచారం చేస్తున్నారని వాపోయారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. పనిచేసే అధికారిని ఇబ్బంది పెట్టవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కోళ్లబైలు ఉప సర్పంచ్ శ్రీనాథ్, మోహన్ రెడ్డి, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కస్టడీకి మద్యం కేసు నిందితులు

మదనపల్లె అర్బన్: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ములకలచెరువు కల్తీ మద్యం కేసులో నలుగురి నిందితులను మంగళవారం విజయవాడ భవానీపురం పోలీసులు పిటి వారెంట్‌పై మదనపల్లె సబ్ జైలు నుంచి కస్టడీకి తీసుకొన్నారు. విచారణ నిమిత్తం నిందితులు ఎ10 అంతా దాస్, ఎ9 మిథున్ దాస్, ఎ6 కట్టా రాజు, ఎ5 షేక్ హాజీలను విజయవాడ కోర్టుకు తరలించినట్లు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. విజయవాడ భవానిపురం పోలీసులు కేసు విచారణకోసం ఎస్కార్ట్ సిబ్బందితో ప్రత్యేక వాహనంలో వచ్చి విజయవాడకు తరలించారు. మరిన్ని వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

కారు ఢీకొని కార్పెంటర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లెలో కారు ఢీ కొనడంతో కార్పెంటర్ పరిస్థితి విషమించింది. ఈ సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక సైదాపేటలో నివాసం ఉంటున్న కార్పెంటర్ జాఫర్ హుస్సేన్ వైఎస్ఆర్ కాలనీలో కార్పెంటర్ పని చేయడానికి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సైదాపేటకు వెళ్తుండగా మార్గమధ్యంలోని బైపాస్ రోడ్డులోని రాయల్ ఉడ్ వద్ద కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాధితుడు కోమాలోకి వెళ్లాడని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని తెలిపి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం పెద్దమండ్యం మండలంలోని కనమలోపల్లి నగిరికి చెందిన కాంతమ్మ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులలో చూపించినా డబ్బు ఖర్చు తప్ప జబ్బు నయం కాలేదు. ఒక్కగానొక్క కుమార్తె కాంతమ్మ బతుకు దెరువు కోసం విదేశాలకు వెళ్లడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఓ పక్క అనారోగ్యం మరోపక్క ఒంటరితనాన్ని భరించలేక జీవితం పై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

పరిశ్రమల స్థాపనతోనే ఉపాధి అవకాశాలు : ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి నియోజకవర్గంలో ఒక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్క్ (ఎంఎస్ఎంఇ పార్క్) పథకంలో భాగంగా శెట్టిగుంట పరిధిలోఎంఎస్ఎంఇ(ఎఫ్ఎఫ్‌సి) ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విశాఖపట్నంలో జరుగుతున్న 30వ పార్ట్నర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం సుమారు రూ.13.40 కోట్లు, ఇది రాష్ట్ర ప్రభుత్వ ఒక్క కుటుంబం ఒక పరిశ్రమ పథకంలో భాగంగా అమలు అవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సంస్థ 2009లోనే శెట్టిగుంట, కోడూరు మండలంలో సుమారు 20.27 ఎకరాల భూమిని పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రతిపాదించిందన్నారు. ఈ భూమిలో 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఇ (ఎఫ్ఎఫ్‌సి) ఫేజ్-2 స్థాపనకు శంకుస్థాపన జరగనుందన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, చిన్న స్థాయి పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. నియోజకవర్గం పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ఇది ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగిరెడ్డి, తహశీల్దారు అమర్నాథ్, టిడిపి నాయకులు నీలకంటయ్య, డి.గోపాల్, కె.రామరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త పగడాల చంద్రశేఖర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.

తంబళ్లపల్లి: మండలంలో రెడ్డికోట వద్ద ఎపిఐఐసి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మంగళవారం సిఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కుక్కరాజుపల్లె సచివాలయం వద్ద తహశీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ రామరాజు, అధికారులు స్క్రీన్ ద్వారా శంకుస్థాపన కార్యక్రమాన్ని చూశారు. మదనపల్లె ఎపిఐఐసి ఐపిఒ శంకర్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి నాగార్జున, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో వైసిపి తలపెట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద మధ్యతరగతి ప్రజలకు విద్య ఉచిత వైద్యం అందుబాటులో ఉండాలని తపనతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి ప్రారంభించారన్నారు. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం కార్పొరేటర్లకు కొమ్ముకాస్తూ పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు, ప్రజలకు వైద్య విద్యతో పాటు వైద్యని కూడా దూరం చేస్తోందన్నారు. తంబళ్లపల్లిలో బుధవారం జరిగే ప్రజా ఉద్యమ ర్యాలీలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కరీం, నాయకులు కెఆర్ మల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, సురేంద్రనాథ్, కృష్ణారెడ్డి, రామ్మూర్తి, రామ శంకర్‌రెడ్డి, హేమారెడ్డి పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పేరిట కోటి సంతకాల సేకరణ చేపట్టామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం శెట్టిగుంటలోని జెండామాను వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వంలో చేస్తున్న మోసాలను క్లుప్తంగా ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, అంబటి మురళి, మల్లు రెడ్డయ్య, మండల నాగేంద్ర, నందా బాల, అంబటి మురళి, షానవాజ్ బాష, సిహెచ్ రమేష్, సర్పంచ్ రామకృష్ణ, శివయ్య, ఉప్పరపల్లి సర్పంచ్ చెంగల్‌రెడ్డి, ఉప్పరపల్లి ఉప సర్పంచ్ మాదినేని వెంకట్‌రెడ్డి, ఎంపిటిసిలు, షఫీ, పుష్పలత, గని, రౌఫ్, జిల్లా యూత్ సెక్రటరీ, డమ్ము రఘు, మనోహర, చాంద్‌బాషా పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి 9, 10వ వార్డుల్లో పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను వైసిపి రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి వి.ఎస్.రెడ్డి ఇంటి వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి నిస్సార్ అహ్మద్‌తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి, వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, మయూరి రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. వారికి కౌన్సిలర్లు సుగుణ, ఆంజనేయులు, పాల్ చంద్రశేఖర్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిస్సార్ మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తోందన్నారు. ముఖ్యంగా పిపిపి విధానంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య, సామాన్యులకు ఉచిత వైద్యాన్ని దూరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో చిప్పిలి మల్లికార్జునరెడ్డి, కొత్తపల్లె మహేష్ బాబు, చరణ్, రాజేష్, మయూరిరెడ్డి, శారద రెడ్డి, వినుతా భాయి, నాగమణి, శ్యామల, మంజుల, లలితారెడ్డి పాల్గొన్నారు.

ఉనికి కోసమే ప్రజా ఉద్యమం : 'రేవూరి'

ప్రజాశక్తి-రాజంపేట : ఉనికి కోసమే వైసిపి ప్రజాఉద్యమం ఈనెల 12న నిర్వహిం చనునందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, యువతను రెచ్చగొట్టడానికే వైసిపి ర్యాలీలు చేస్తుందని అన్నారు. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రయివేటీకరణ చేస్తుందంటూ అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నం చేస్తుందన్నారు. పిపిపి విధానం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎటువంటి నష్టం జరగదని పేర్కొన్నారు. కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 50 శాతం విద్యార్థులకు సీట్లు వస్తాయని తెలియజేశారు. పేదలకు ఎటువంటి ఒపి రుసుం లేకుండా వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. విద్యార్థులను, యువతను రెచ్చగొట్టి రాజకీయం చేయాలని వైసిఐప చూస్తుండటం చాలా సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల జగన్ పరిపాలనలో తూతూ మంత్రంగా వైద్య కళాశాలలు నిర్మించి పేద విద్యార్థులకు చదువును దూరం చేసింది జగన్ కాదా అని ప్రశ్నించారు. విద్యార్థులను ఉద్ధరిస్తాం అన్నట్టు ర్యాలీలు చేయడం చూస్తుంటే దొంగే దొంగ అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా, వైద్య కళాశాలల నిర్మించకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ, అబద్ధపు మాటలు చెబుతుందన్నారు. విద్యార్థులు, యువతను నమ్మించే ప్రయత్నం వైసీపీ చేస్తుందని, వైసిపిని నమ్మే పరిస్థితుల్లో రాష్ట్రంలో విద్యార్థి, యువత లేరన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువతే వైసిపికి తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, నాయకులు యానాది, రెడ్డిశేఖర్, సాయినాథ్ పాల్గొన్నారు.

కలకడ టిడిపి మండల అధ్యక్షుడిగా ప్రభాకర్

ప్రజాశక్తి- కలకడ







టిడిపి మండల అధ్యక్షులుగా ప్రభాకర్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కలికిరిలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. మండల ఉపాధ్యక్షులుగా విశ్వనాథ నాయుడు, జనరల్ సెక్రటరీగా వెంకటరమణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే నల్లారి మాపై నమ్మకంతో ఉంచి ఈ పదవులు ఇచ్చినందుకు వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. అహర్నిశలు పార్టీ కోసం పని చేసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. మండలంలో వర్గాలు విభేదాలకు తావు లేకుండా అందరము కలిసికట్టుగా పార్టీకి పనిచేసే మండలంలో తెలుగుదేశం పార్టీకి ఎదురులేకుండా చేస్తామని వారు హామీ ఇచ్చారు.

కలికిరి టిడిపి మండల అధ్యక్షుడిగా షాబుద్దీన్

ప్రజాశక్తి - కలికిరి



టిడిపి మండల నూతన అధ్యక్షుడిగా ఖతిబ్ షాబుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన టిడిపి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, గ్రామకమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వినర్ల ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా కలికిరి మండల టిడిపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఖతిబ్ షాబుద్దీన్‌ను ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండ లంలోని టిడిపి నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యేకు సహచర టిడిపి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని టిడిపి నాయకులందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, మండలంలోని నాయకులు కార్యకర్తలు అందరూ సహకరించాలని కోరారు.

'యల్లటూరు'కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-రాజంపేట

నందలూరు మండలానికి చెందిన జనసేన పార్టీ యువ నాయకుడు భారతాల ప్రశాంత్‌కు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు మంగళవారం యల్లటూరు భవన్‌లో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాస రాజును కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాసరాజు ప్రశాంత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జనసేన పార్టీ కోసం, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట జనసేన నాయకులు, జన సైనికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో మొబైల్ డీ-అడిక్షన్‌పై అవగాహన

ప్రజాశక్తి- మదనపల్లె

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో మొబైల్ డి అడిక్షన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరుకు చెందిన వెల్‌నెస్ ట్రైనర్ పి.జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో మొబైల్ ఫోన్లపై అధికంగా ఆధారపడటం వల్ల చదువుపైనా, వ్యక్తిగత సంబంధాలపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని పూర్తిగా నిరాకరించకుండా, దాన్ని సమతుల్యంగా వినియోగించడం నేర్చుకోవడం అత్యవసరం అని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, డిజిటల్ డిటాక్స్ అలవాటు చేసుకోవడం, వృత్తి అభివృద్ధి దిశగా స్మార్ట్ పద్ధతులు అవలంబించడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగ రెడ్డి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ అవసరమైన సాంకేతిక పరికరమని, కానీ దానిపై అధిక ఆధారపడటం మానవ సామర్థ్యాన్ని తగ్గించే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, సమయాన్ని నియంత్రించడం ద్వారా టెక్నాలజీని సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాయుడు మాట్లాడుతూ డిజిటల్ ఎంగేజ్‌మెంట్ సమకాలీన ప్రపంచంలో తప్పనిసరి అయినప్పటికీ, దాని సానుకూల, ప్రతికూల ప్రభావాలను తెలుసుకోవడం అవసరమని చెప్పారు. హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ టి.అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధి, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, అధ్యాపకులు కె.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ సి.నాగార్జున, కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి ఆర్.వసంత కుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజెప్పడమేనన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల సహకారం కోరడం, సంపూర్ణ అక్షరాస్యత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడమని పేర్కొన్నారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, పిల్లల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, వారికి సంబంధించిన అంశాలపై ప్రముఖ వ్యక్తుల ప్రసంగాలు, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడలు, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న అక్షరాస్యతా దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల ముగుస్తాయన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు, మహిళలు గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడలాని తెలిపారు.

మునగ సాగుతో రైతులకు ఆదాయం

ప్రజాశక్తి-వీరబల్లి

మునగ సాగుతో రైతులకు ఆదాయం పెరుగుతుందని జీవనోపాదుల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగార్జున తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మునగ సాగు చేసే రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబల్లి మండలానికి మునగ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు అయిందని అన్నారు. పచ్చి మునగ ఆకును రైతుల దగ్గర కొనుగోలు చేసి, దాని ద్వారా పౌడర్ చేసి విక్రయిస్తారని చెప్పారు. తమిళనాడు పెరియాకులం నుండి విత్తనాలు తెప్పించి, రైతులకు ఒక కిలో రూ 3 వేలతో ఇస్తున్నామన్నారు. ఉపాధిహామీ, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ఉద్యానవన శాఖలతో అనుసంధానిస్తామని చెప్పారు. చేపల సాగులో కోరమీను చేపలు సాగుకు ఆసక్తి గల రైతులు వెలుగు కార్యాలయంలో వివరాలు తెలుసుకొని, అప్లయి చేసి సాగు చేయవచ్చు అన్నారు. కార్యక్రమాలు పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో మాత్రమే చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం ఖాదర్ వలి, సిసిలు గంగాధరం, నాగేంద్ర, మండల యాంకర్ పర్సన్ అనిత, సి. ఆర్‌పిలు జ్యోతి, అనురాధ, రెడ్డెమ్మ, రైతు మిత్రులు జానమేజయుడు, వెంకటేష్, లీగల్ కో- ఆర్డినేటర్ ఆనంద్ బాబు, మండల వ్యవసాయం సమాఖ్య కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి రామయ్య, ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ అధికారులు, మునగ సాగుచేసే రైతులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

లయన్స్ క్లబ్ ఆఫ్ హార్శిలీహిల్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతి చౌక్ వద్ద మంగళవారం మధుమేహ పరీక్షలు నిర్వహించారు. సుమారు 55 మంది తమ రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా లయన్ కోగర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా రెండవ మంగళవారం ఇలాంటి మధుమేహ పరీక్ష శిబిరాలు ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు తరచూ మధుమేహ పరీక్షలు చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే మధుమేహాన్ని అరికట్టవచ్చునన్నారు. మధుమేహం ఉన్నవారు తరచూ పరీక్షలు చేయించుకుని అందుకు అవసరమైన మందులు తీసుకుంటే వ్యాధిని నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ రాణి, బొమ్మసాని నవీన్, ఎన్.హరిబాబు పాల్గొన్నారు.

రేపు ఎంఎంసి చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నిమ్మనపల్లె

మదనపల్లి మార్కెట్ యాడ్ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని నిమ్మనపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు ప్రదీప్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన మదనపల్లి టమాట మార్కెట్ యార్డ్‌కు నూతన పాలకమండలి వర్గం ఈనెల 13న ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీకి చెందిన జంగాల శివరాం మదనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్నారని, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జనసేన పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి పసుపులేటి హరిప్రసాద్, రీజనల్ కో- ఆర్డినేటర్ గంగారపు రాందాస్ చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. జంగాల శివరాం ఆధ్వర్యంలో మదనపల్లి మార్కెట్ యార్డ్ సరికొత్త రూప రేఖలు సంతరించుకోబోతుందని చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ జన సైనికులు, అభిమానులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునివ్వడం అభినందనీయం

ప్రజాశక్తి-సుండుపల్లి

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునివ్వడం అభినందనీయమని ఎంఇఒ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పెద్దినేనికాల్వ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాన్యంవారి పల్లి కురువపల్లికి చెందిన దాత మంగిర శ్రీనివాసులు, తండ్రి చిన్న రెడ్డయ్య రూ. 10,500 విలువ చేసే విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ దాత పాఠశాల అభివృద్ధికి పాటుపడడంతో సంతోషకరమన్నారు. దాత మాట్లాడుతూ విద్యార్థులు విద్యాసామగ్రిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉయ్యాల ధనమ్మ, ఉత్తమ ఉపాధ్యాయుడు నంద్యాల వెంకట సిద్దయ్య , ఉత్తమ ఉపాధ్యాయులు పార్వతమ్మ పాఠశాల కమిటీ చైర్మన్ సయ్యద్ హీరా, ఈ పాఠశాల మాజీ చైర్మన్ కుంచ శ్రీనివాసులు ఉర్దూ పాఠశాల హెడ్ టీచర్ యూసబ్, గ్రామ పెద్దలు వెంకటరమణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.